## క్లుప్తంగా

### ఘనంగా హిందీ బాషా దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత

నందికొట్కూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం హిందీ బాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సునీత మాట్లాడుతూ హిందీ నేర్చుకున్న వారికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు సులభంగా ఉంటుందన్నారు. పోస్టల్, రైల్వే, బ్యాంకింగ్, కేంద్ర ఆహార సంస్థ తదితర విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు కూడా మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రఘుపతిరెడ్డి, అన్వర్ హుసేన్, ఖాజాహుసేన్ పాల్గొన్నారు.

### నవనంది విద్యార్థి ప్రతిభ



ఎం.సాయి నిక్షిత్

నందికొట్కూరు: అంతర్జాతీయ జంప్–రోప్ పోటీలకు తమ పాఠశాల 6వ తరగతి విద్యార్థి ఎం.సాయినిక్షిత్ ఎంపికయ్యాడని నవనంది హైస్కూల్ చైర్మన్ శ్రీధర్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలోని నాండేడ్‌లో ఈనెల 12, 13 తేదీల్లో జరిగిన సబ్ జూనియర్ జాతీయ జంప్–రోప్ విభాగంలో రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడని, త్వరలో థాయిలాండ్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొననున్నాడని ఆయన తెలిపారు.

### దెబ్బతిన్న పంటల పరిశీలన

పాములపాడు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటరమణమ్మ, డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ పుల్లిబాయి మంగళవారం పరిశీలించారు. పాములపాడు, చెలిమిల్ల గ్రామాల పరిధిలోని పొలాల్లో పర్యటించి పైర్లకు ఆశించిన పురుగులు, తెగుళ్లను గుర్తించి వాటి నివారణకు రైతులకు సలహాలిచ్చారు. వారి వెంట ఏఈఓ మద్దిలేటి, వీఏఏ గాయత్రీ, ఎంపీఈఓ మున్‌షేర్ పాల్గొన్నారు.

### ముగ్గురు విద్యార్థులకు మెడికల్ సీట్లు



పి.మనోజ్ కుమార్, అబ్రహాం సఫియా

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణ శివారులోని డీ– పాల్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ముగ్గురు ఎంబీబీఎస్ సీట్లు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2021 – 22 సంవత్సరం ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు పి మనోజ్, అబ్రహాం, సఫీయా నీట్‌లో మంచి ర్యాంక్ తెచ్చుకుని ఎంబీబీఎస్ సీట్లు సాధించినట్లు యాజమాన్యం తెలిపింది.

### కుమారస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధి గాంచిన బయలువీరభద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### పౌర్ణమి పూజలు



స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం

శ్రీశైలంటెంపుల్: పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం శ్రీశైలంలో స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి పూజలు జరిపారు. అలాగే ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

# ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

● అదనపు జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ శారదాబాయి



మాట్లాడుతున్న అదనపు జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ శారదాబాయి

జూపాడుబంగ్లా: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ సాధ్యమని అదనపు జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ శారదాబాయి సూచించారు. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు బాల, బాలికలకు వ్యాపించే అనిమియా వ్యాధి నివారణకు తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. మంగళవారం నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అదనపు డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శారదాబాయి మాట్లాడుతూ చేతులు సరిగా శుభ్రం చేసుకోకుండా తినటం, కలుషితమైన ఆహారం తీసుకోవటం, అపరిశుభ్రమైన ప్రాంతాల్లో సంచరించటం వల్ల ఏడాది నుంచి 19 ఏళ్లలోపు బాల, బాలికలకు కడుపులో నులిపురుగులు వ్యాపిస్తాయన్నారు. వీటి వల్ల శరీరంలో రక్తహీనత ఏర్పడుతుందన్నారు. ఎదుగుదల లోపించి శరీరం దృఢత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి రాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నూర్జహాన్, డాక్టర్ గంగాధర్, సీహెచ్ఓ వహాబ్, సూపర్‌వైజర్ రాముడు, పాఠశాల ఎస్ఓ యశోద, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నేషనల్ డివామింగ్ డే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సాజిదా పిర్దోస్ మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవడం వల్ల విద్యార్థులకు జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. బహిర్భూమికి, మూత్రానికి వెళ్లినప్పుడు, భోజనం చేసే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. అలాగే బైర్లూటీ వైద్యాధికారి సి.గోపాల్ ఆధ్వర్యంలో అమలాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వడీ సెంటర్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మిగించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వేడి వేడి ఆహార పదార్థాలను భుజించాలని విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఆర్.మారెన్న సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్.వి.అబూబకర్, కె.సూర్యనారాయణ, డి.రామచంద్రయ్య, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశా వర్కర్ శోభ పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జాతీయ నులి పురుగుల దినోత్సవం, పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. తహసీల్దార్ ధోని ఆల్‌ఫ్రెడ్, ఎంపీడీఓ వాసుదేవగుప్త, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఎంఈఓ మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దాక్షాయణి, డాక్టర్ శ్రీజ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న అధ్యాపకులు



విద్యార్థులకు సూచనలిస్తున్న వైద్యాధికారిణి సాజిదా పిర్దోస్

### వరద బాధితులకు విరాళం

నందికొట్కూరు: విజయవాడ వరద బాధితులకు గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రూ.65,800 విరాళమిచ్చింది. సంఘం అధ్యక్షులు రమణ తదితరులు మంగళవారం అల్లూరు గ్రామంలో మాండ్ర స్వగృహంలో ఎమ్మెల్యే జయసూర్యను కలిసి చెక్కును అందజేశారు.

**పొదుపు సంఘాలు..**

ఆత్మకూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం శ్రీశైలం నియోజకవర్గంలోని పొదుపు మహిళా సంఘాలు ఆర్థిక సాయం చేశాయి. నియోజకవర్గం నుంచి మొత్తం రూ.19,57,950 విరాళాలను సీఎం సహాయ నిధి నిమిత్తం మంగళవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి పీడీ శ్రీధర్‌రెడ్డి, ఏరియా కో ఆర్డినేటర్ పుల్లయ్యల ఆధ్వర్యంలో అందించారు.

### హాస్టల్‌లో సమస్యలు పరిష్కరిస్తాం

పాములపాడు: బాలికల వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం వసతిగృహాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, వంటశాల, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. నేషనల్ హైవే నిర్మాణంలో భవనం కోల్పోతున్నామని, వంట మనిషి పోస్టు ఖాళీగా ఉందని డబ్ల్యూహెచ్ఓ అనిత.. ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచు మల్లేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవం



యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం



రక్తదానం చేసిన యువడికి ప్రశంసా పత్రం అందజేస్తున్న దృశ్యం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని మంగళవారం స్థానిక విరాట్ విశ్వకర్మ అన్నదాన సత్రంలో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ సుప్రభాతసేవ, గణపతిపూజ, పుణ్యాహవాచన, విశ్వకర్మ కలశపూజ, పతాకావిష్కరణ, గాయత్రీ సమేత విశ్వకర్మ భగవానుల వారి యజ్ఞం నిర్వహించారు. లోకకల్యాణం కోసం ప్రపంచశాంతి, సౌభాగ్యాల కోసం, సమస్త మానవజాతి సుఖసంతోషాల కోసం మహాయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో విరాట్ విశ్వకర్మ సత్రం అధ్యక్షులు ముత్తలూరి బాలయ్యాచారి, ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల నరసింహారావు, కోశాధికారి పాలెపు నాగభూషణాచారి తదితరులు పాల్గొన్నారు.

**రక్తదాతలకు ప్రశంసా పత్రం**

ఆత్మకూరు: విశ్వకర్మ జయంతి, ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం కార్యక్రమాల సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. రక్త దాతలకు జాతీయ కార్యవర్గ సభ్యురాలు, మైనార్టీ మోర్చా శ్రీశైలం నియోజకవర్గ కో ఆర్డినేటర్ మోమిన్‌షబానా ప్రశంసా పత్రాలు అందజేశారు.

**ఘనంగా విశ్వకర్మ జయంతి**

ఆత్మకూరురూరల్: స్థానిక కాళికాంబ అమ్మ వారి దేవస్థానంలో మంగళవారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి కలశ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు విశ్వరూపాచారి, సహదేవాచారి, పరమేశ్వరాచారి పాల్గొన్నారు.

**మోదీ చిత్రపటానికి పాలాభిషేకం**

ఆత్మకూరు: విశ్వకర్మ విరాట్ భగవాన్ జయంతి, ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను మంగళవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేల కృష్ణారెడ్డి, గరుడాద్రి సత్యనారాయణశర్మ, సుదర్శనశర్మ, సాంబశివగౌడ్, గోపాల్, మౌలిబాషా పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

### రేపటి నుంచి మండల స్థాయి క్రీడలు

జూపాడుబంగ్లా: స్థానిక గురుకుల పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 19, 20 తేదీల్లో మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ మండల కోఆర్డినేటర్ పి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### రేపటి నుంచి మౌలాలి స్వామి సరిగెత్తు వేడుకలు

పాములపాడు: మండలంలోని వాడాల గ్రామంలో ఈనెల 19 నుంచి రెండు రోజుల పాటు మౌలాలి స్వామి సరిగెత్తు వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. గ్రామస్తుల ఆర్థిక సహకారంతో నూతన పీర్ల చావిడి నిర్మాణం చేపట్టడంతోపాటు మౌలాలిస్వామి పీరును తయారు చేయించినట్లు తెలిపారు.

### పరమేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు

వెలుగోడు: మండల పరిధిలోని వేల్పనూరు గ్రామంలో పౌర్ణమిని పురస్కరించుకుని అంకాల పరమేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో 4వ విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ.రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల ఫిట్టర్, టర్నర్, డ్రాఫ్ట్‌స్‌మెన్ సివిల్ కోర్సులకు, ఏడాది వెల్డర్ కోర్సుకు సీట్లు ఉన్నాయన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు, వెల్డర్‌కు పదవ తరగతి ఫెయిల్ అయిన వారు అర్హులని, ఈనెల 26వ తేదీలోగా www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9703395091, 9440748448, 9441181072 సంప్రదించాలన్నారు.

### ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వరా?

బండిఆత్మకూరు: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి ప్రజాప్రతినిధులమైన తమకు సమాచారం ఇవ్వకపోవడం తగదని సర్పంచ్ సంధ్య, ఎంపీటీసీ సభ్యులు ముంతల మధురాణి, ఎరుకల పుల్లయ్య, కో – ఆప్షన్ మెంబర్ దూదేకుల జమాల్ అన్నారు. అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మరోసారి పునరావృతమైతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై ఎంపీడీఓ వాసుదేవగుప్తను వివరణ కోరగా బాధ్యులకు షోకాజ్ నోటీసు ఇచ్చామన్నారు.

### లైసెన్స్ లేకుండా వాహనం నడపొద్దు

కొత్తపల్లి: లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ ఎం.కేశవ హెచ్చరించారు. మంగళవారం దుద్యాల గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ధరించని, లైసెన్స్ లేని 18 వాహన డ్రైవర్లకు రూ.4,830 జరిమానా విధించారు.

# సాగు నీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం

● ఓటర్ల జాబితాలో నిమగ్నమైన నీటిపారుదలశాఖ అధికారులు

జూపాడుబంగ్లా: సాగునీటిసంఘాల ఎన్నికలకు జలవనరులశాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికలు త్వరలో నిర్వహించే అవకాశాలున్న నేపథ్యంలో రెవెన్యూ గ్రామాల వారిగా ఆయకట్టు రైతుల జాబితా సేకరణలో అధికారులు తలమునకలయ్యారు. మండల పరిధిలో కేసీ కాల్వ కింద 2,450 ఎకరాల ఆయకట్టు ఉండగా కేసీ కాల్వ కింద పొలం ఉన్న రైతులకు మాత్రమే ఓటుహక్కు ఉంటుంది. 35 బొల్లవరం (డబ్ల్యూయూఏ–5) వాటర్ యూజర్ అసోసియేషన్ ఉంది. ఒక డబ్ల్యూయూఏ కింద 12 మంది టీసీలు ఉంటారు. 250 ఎకరాలకు ఒక టీసీ ఉంటారు. 2015 లో జరిగిన సాగునీటి సలహా సంఘాల ఎన్నికలు 2019 వరకు కొనసాగాయి. అప్పట్లో ఎన్నికలకు ప్రత్యక్ష పద్ధతి( రైతులు చేతులు ఎత్తే విధానం)లో ఎన్నికలు నిర్వహించారు. వాటి కాలపరిమితి ముగియటంతో మళ్లీ ఇప్పటిదాకా ఎన్నికలు నిర్వహించలేదు. ప్రస్తుతం సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న నేపథ్యంలో అధికారులు ఓటర్ల జాబితాను తయారుచేస్తున్నారు. 35 బొల్లవరం డబ్ల్యూయూఏ కింద తాటిపాడు, 35బొల్లవరం, 80బన్నూరు, తరిగోపుల, ఘణపురం(పోతులపాడు) రెవెన్యూ గ్రామాల రైతులు ఓటర్లుగా ఉంటారు. పాములపాడు డబ్ల్యూయూఏ–6 కింద జూటూరు, తమ్ములూరు, చెలిమిల్ల, పాములపాడు, కంబాలపల్లె, బానుముక్కల గ్రామాల రైతులు ఓటర్లుగా ఉంటారు. ఈ పర్యాయం నిర్వహించే సాగునీటి సంఘాల ఎన్నికలు రసవత్తరంగా ఉండనుండగా ఎన్నికలు ప్రత్యక్షంగా చేతులు ఎత్తేవిధానం ద్వారా నిర్వహిస్తారా లేక రహస్య బ్యాలెట్ విధానం ద్వారా నిర్వహిస్తారా అనే విషయాలపై స్పష్టమైన గైడ్‌లెన్స్ రాలేదని జలవనరులశాఖ అధికారులు పేర్కొంటున్నారు. కేసీ కాల్వ ఆయకట్టు కింద సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగితే చెరువుల కిందున్న ఆయకట్టు రైతులకు కూడా సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

### 23లోగా ఈకేవైసీ చేయించుకోండి

జూపాడుబంగ్లా: పంటల నమోదులో భాగంగా ఈనెల 23లోగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండ్లెం, తంగడంచ గ్రామాల రైతుసేవా కేంద్రాల్లో జరుగుతున్న ఈకేవైసీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈనెల 15వ తేదీ నాటికే పంట నమోదు, ఈకేవైసీ ప్రక్రియ పూర్తైనప్పటికీ ప్రభుత్వం ఈనెల 23 వరకు గడువు పెంచిందన్నారు. మండల వ్యాప్తంగా 24 వేల ఎకరాల్లో పంటలు సాగుచేయగా ఇప్పటి దాకా 19వేల ఎకరాల్లో రైతులు ఈపంట నమోదు చేయించుకున్నారన్నారు. 80 శాతం పంటల నమోదు, 74 శాతం ఈకేవైసీ పూర్తయిందని, మిగిలిన రైతులు సత్వరమే రైతుసేవా కేంద్రాల వద్దకు వెళ్లి పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

కొత్తపల్లి: ఈకేవైసీ చేయించుకుంటేనే పంట నమోదు చేయించుకున్నట్లని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ మంగళవారం తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న 7,115 మంది రైతుల్లో 4,980 మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నారని, మిగిలిన వారు వారంలోపు చేయించుకోవాలని సూచించారు.

### పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మిడుతూరు: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మంగళవారం కడుమూరు గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరై పూర్తి చేసిన గృహాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి, ఈఓఆర్డీ ఫకృద్దీన్ పాల్గొన్నారు.

### దుకాణాల తనిఖీ



బండిఆత్మకూరు: మండల పరిధిలోని సంతజూటూరు గ్రామంలో ఫర్టిలైజర్ షాప్‌లను వ్యవసాయ అధికారి స్వాతి తనిఖీ చేశారు. రైతులకు బిల్లులు ఇవ్వాలని డీలర్లకు సూచించారు.

### చెత్తాచెదారం తొలగింపు

జూపాడుబంగ్లా: ×సాక్షి¥ దినపత్రికలో ×కల్వర్టు శిథిలం..నిలిచిన నీటిప్రవాహం¥ శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి కేసీ కాల్వ అధికారులు స్పందించారు. కల్వర్టు వద్ద నీటిప్రవాహానికి అడ్డంగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని లష్కర్లతో తొలగింపజేశారు. దిగువకు సవ్యంగా నీరు వెళ్లేలా చేశారు. శిథిలమైన కల్వర్టు వద్ద కుంగి రంధ్రాలు పడిన చోట రాళ్లు, మట్టిని వేసి తాత్కాలికంగా పూడ్చివేశారు. నూతన కల్వర్టు నిర్మాణం కోసం గ్రామపంచాయతీ అధికారులు, సర్పంచు సహకారంతో జిల్లా నీటిపారుదలశాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. నిధులు మంజూరైతే నూతన కల్వర్టును నిర్మిస్తామని ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు.



చెత్తను తొలగిస్తున్న లష్కర్లు

# అలరించిన భజన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణమాడ వీధిలోని నిత్యకళావేదికపై గాజులపల్లెకు చెందిన ఎస్.కృష్ణలలిత వారి భజన కార్యక్రమం అలరించింది. విఘ్నేశ్వర వినాయక, కరుణించరా శివా శ్రీశైలవాసా, పార్వతీ నాథుడా, శ్రీగిరి మల్లయ్య, పాతాళగంగమ్మ, కైలాసవాసుని, ఎవరికి ఎవరయ్యా ఈశ్వరా, ఈశా మహేశా, కైలాసగిరివాసా మొదలైన భక్తిగీతాలను, భజన కీర్తనలను తిరుపతి వెంకటయ్య, చంద్రశేఖర్, బసప్ప, రామచంద్రయ్య, భీమయ్య, రఘుపతి, యశోద, లక్ష్మీపద్మమ్మ, పరమేశ్వరి, రామలక్ష్మమ్మ, శ్రీదేవి, ఆదిలక్ష్మీ, సుబ్బరత్నం, కోటేశ్వరమ్మ, సుహాసిని తదితరులు ఆలపించారు.




### మద్యం బాటిళ్ల స్వాధీనం

శ్రీశైలంటెంపుల్: ఇద్దరు వ్యక్తుల నుంచి 19 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జి.ప్రసాదరావు తెలిపారు. మంగళవారం శ్రీశైలం టోల్‌గేట్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సున్నిపెంటకు చెందిన భూమన వెంకటేశ్వర్లు, శ్రీశైలం గ్రామం మాణిక్యమ్మసెలకు చెందిన మాన్ల శివ వద్ద మద్యం బాటిళ్లు గుర్తించి స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



### కొనసాగుతున్న భక్తుల సందడి

మహానంది: భాద్రపద మాసం పురస్కరించుకుని మహానంది ఆలయంలో భక్తుల సందడి కొనసాగింది. మంగళవారం పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామిని దర్శించుకున్నారు.



### లక్ష్యం నిర్దేశించుకుని చదవాలి

పాములపాడు: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని ఎంఈఓ బాలాజీ నాయక్ సూచించారు. మెడిసిన్‌లో ర్యాంక్ తెచ్చుకుని కర్నూలు మెడికల్ కాలేజీలో సీటు సాధించిన వివేకానంద విద్యావిహార్ హైస్కూల్ పూర్వ విద్యార్థి మధుపవన్‌ను మంగళవారం పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పిల్లలు అభివృద్ధి చెందితే తల్లిదండ్రులతోపాటు గురువులు కూడా ఎంతో సంతోష పడతారన్నారు. మధుపవన్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ గోపాల్, విద్యార్థి తల్లిదండ్రులు సాయిక్రిష్ణ, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.



మధుపవన్‌ను సత్కరిస్తున్న ఎంఈఓ, స్కూల్ సిబ్బంది

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే జయసూర్య ప్రజలకు సూచించారు. మంగళవారం స్థానిక జై కిసాన్ పార్కులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ ఆవరణలో మొక్కలు నాట్టారు. రోగాలు దరి చేరకుండా వ్యక్తిగత శుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టిన రోజు సందర్భంగా పటేల్ సెంటర్‌లో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఆర్టీసీ బస్టాండ్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా డీఎం నాగేశ్వరరావు మొక్కలు నాట్టారు. 10 బొల్లవరం గ్రామంలోనూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కమిషనర్ బేబి, టీపీఓ బాలమద్దిలేటి, వైస్ చైర్మన్ రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

**పరిశుభ్రతలో భాగస్వాములు కావాలి**

➤ పాములపాడు: గ్రామల్లో పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ గోపీక్రిష్ణ సూచించారు. మంగళవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. మొక్కలు నాటి సంరక్షించాల, చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ పారవేయరాదని వారు సూచించారు. కార్యక్రమంలో సర్పంచు మేకల భాగ్యమ్మ, ఎంఈఓలు బాలాజీనాయక్, సుభాషిణి పాల్గొన్నారు.

➤ కొత్తపల్లి: మండలంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు మంగళవారం విద్యార్థులతో కలిసి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి, ఎంఈఓ ఇనాయతుల్లా, సర్పంచు లక్ష్మీదేవి, దుద్యాల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కుసుమలత, సర్పంచు శోభలత పాల్గొన్నారు. దుద్యాల జెడ్పీ హైస్కూల్‌లో ఎంపీపీ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

➤ మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఈఓఆర్డీ శివనాగజ్యోతి, ఏపీఓ మనోహర్ పాల్గొన్నారు. అలాగే మహానందితోపాటు అన్ని గ్రామ పంచాయతీల్లో కార్యక్రమాలు నిర్వహించారు.

➤ మిడుతూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల వ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పారిశుధ్య పనులతోపాటు హెల్త్ క్యాంపులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.




ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జయసూర్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు



స్వచ్ఛతా హీ సేవాపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు

➤ జూపాడుబంగ్లా: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదనపు జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ శారదాబాయి, మండల స్పెషల్ అధికారి రాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం జూపాడుబంగ్లాలో ర్యాలీ నిర్వహించారు. మోడల్ స్కూల్‌లో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మొట్టె బాలయ్య, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి, ఏఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

➤ ఆత్మకూరు: పట్టణంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఎం.ఎ.రషీద్, మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఏఈ ఓబులేష్, మేనేజర్ చాంద్‌బాషా, రాంప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జీవన్ పాల్గొన్నారు. అలాగే ఏపీఎస్ఆర్టీసీ గ్యారేజీ ఆవరణలో డిపో మేనేజర్ మహేంద్రుడు ఉద్యోగులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు.

➤ వెలుగోడు: మండల వ్యాప్తంగా మంగళవారం స్వచ్ఛతా హీ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ అమానుల్లా తదితరులు పాల్గొన్నారు.